ప్రజాశక్తి

గురువారం 29 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతా అడ్డగోలుతనం

- నగరం నడిబొడ్డున జిఒ 8
- పర్యాటకం పేరుతో 'వరుణ్ హాస్పిటాలిటీ'కి అసాధారణ రాయితీలు
- 15 ఏళ్ల పాటు పన్నులన్నీ మినహాయింపు
- బ్రిడ్జి నిర్మాణానికి విఎంఆర్‌డిఎకు ప్రభుత్వ ఆదేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇది నిఖార్సయిన అధికారిక అడ్డగోలు తనం. ప్రజల వనరులను ప్రయివేటు, బడా సంస్థలకు కట్టబెట్టే ఆశ్రిత పక్షపాతం. నగరం నడిబొడ్డున అధికార పక్ష వర్గానికి సృష్టించిన 'సంపద'కు ఇదో మచ్చుతునక. పర్యాటకానికి ప్రోత్సాహం పేరుతో అన్ని నిబంధనలను తుంగలో తొక్కుతూ అయిన వారికి రూ.కోట్లలో రాయితీలిచ్చే విధానం. విశాఖ నగర ప్రజలపై మాత్రం పన్నులను బాదేస్తూ సదరు బడా హోటల్ అధినేతకు మాత్రం ఏళ్ల తరబడి పన్నులను మినహాయించిన వైనం ఇది.. 'సంపద సృష్టిస్తానంటూ పదేపదే చెబుతోన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎవరికి సంపదలు పోగు చేస్తున్నారో విశాఖ నగరంలో వెల్లడైంది.

అంతా సొంత లాభం....

విశాఖ నగరం నడిబొడ్డున ఆర్‌కె.బీచ్‌లో నోవాటెల్ హోటల్ ఉన్న సంగతి తెలిసిందే. దీని పక్కనే తాజ్ హోటల్ ఉండేది. కొన్నాళ్ల క్రితం వరుణ్ గ్రూప్ అంటే నోవాటెల్ యజమాని ప్రభుకిశోర్ ఈ తాజ్ గేట్‌వేను కొనుక్కున్నారు. ఇక్కడ 'వరుణ్ హాస్పటాలిటీస్ సంస్థ పేరిట మెగా ప్రాజెక్టులను నిర్మించేందుకు ప్రణాళిక వేశారు. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే

మిగతా 2లో..

ఉన్నత న్యాయ వ్యవస్థ సభ్యునిచే విచారించాలి : ఇఎఎస్ శర్మ

నగరంలోని వాల్తేరు క్లబ్ వెనుక (దసపల్లా హిల్స్ వైపు) గల చర్చి ఎదురుగా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించడానికి ఇలాగే అడ్డగోలు అనుమతులను ప్రభుత్వం గతంలో ఇచ్చింది. ఈ భవనం పునాదులు ఊటగెడ్డలోని నీటిలో ఉన్నాయి. భవన నిర్మాణ నియమాల ఉల్లంఘన ఇది. తాజాగా అవుటాఫ్ ద వే (నిబంధనలకు విరుద్ధంగా) రాయితీలను జిఒ 8 ద్వారా ప్రభుత్వం ఇవ్వడం తగనిపని. కొత్తగా నిర్మించబోయే హోటల్‌లో ఉద్యోగుల సంఖ్య 1300 మంది. స్థానికులకు ఇక్కడ అవకాశం రాదు. దీనిపై ఉన్నత న్యాయ వ్యవస్థ సభ్యుని నేతృత్వంలో స్వతంత్ర విచారణకు ప్రభుత్వం చొరవ చేయాలి అని విజయానంద్‌కు ఇఎఎస్.శర్మ వరుణ్ హాస్పిటాలిటీస్‌పై లేఖ రాశారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

సమ్మె జరుగుతున్నా...

మరో 1400 మంది తొలగింపు అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు గత 9 రోజులుగా ఐక్యంగా సమ్మె చేస్తుంటే స్టీల్ యాజమాన్యం మరో 1400 మంది కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. బుధవారం కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలపడానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యన్నారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా యాజమాన్యం తొలగించడంవల్లే సమ్మెలోకి వెళ్లారని గుర్తుచేశారు. నేడు సమ్మె ఉధృతం అవుతున్న నేపథ్యంలో యాజమాన్యం మరింత బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. మరోవైపు కార్మికులు ఐక్యంగా కదిలి సమ్మె చేస్తుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తొలగింపు చర్యలు ఆపడానికి, సమ్మె డిమాండ్ల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవటం లేదన్నారు. మరోవైపు సిఎమ్‌డి వెళ్లి ముఖ్యమంత్రిని కలిసిన తరువాత విశాఖ జిల్లా కలెక్టర్‌ను, సిపిని కలవడమంటే మరింత నిర్బంధ చర్యలకు పాల్పడటమే నన్నారు. మహానాడు

మిగతా 2లో..

ఆస్తి పన్ను సర్వే విరమించాలి

- వార్డ్వా, నివాస్ డిమాండ్

వార్త 8లో..

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

వార్త 7లో..

జులై 14 నుంచి గీతం దూరవిద్య పరీక్షలు

వార్త 4లో..

డిఎస్‌సి మోడల్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

డిఎస్‌సి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన డిఎస్‌సి మోడల్ పరీక్షను బుధవారం ద్వారకానగర్ గాయత్రి కోచింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, నిరుద్యోగుల తరపున నోటిఫికేషన్ విడుదల కోసం పోరాటం చేయడమే కాదు, చదువులో కూడా వారికి సహకారం అందించాలని మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా మోడల్ టెస్ట్ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ నగరంలోని పలు సినిమా థియేటర్లలో అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు.

గాజువాక : గాజువాకలోని కన్య, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని సినిమాస్‌లో ఆర్‌డిఒ శ్రీలేఖ ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్లు, సిటింగ్ కెపాసిటీ, సినిమా హాల్లో తినుబండారాలపై ఉన్న ధరలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గాజువాక తహశీల్దార్ శ్రీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం పరిధిలోని నరసింహ, శ్రీ నరసింహ, సుకన్య, సౌజన్య సినిమా హాళ్లలో ఆర్‌డిఒ టి.శ్రీలేఖ తనిఖీలు చేపట్టారు. ప్రేక్షకుల నుంచి ప్రభుత్వానికి తరచూ వస్తున్న ఫిర్యాదులపై పరిశీలించారు. సినిమా హాళ్లలో కూర్చున్న కుర్చీలు, తినుబండారాలు, శీతలపానీయాల ధరలు అత్యధికంగా ఉండటం, మంచి నీటి సదుపాయం, టాయిలెట్లు సక్రమంగా లేకపోవడంపై థియేటర్ సిబ్బందిని ప్రశ్నించారు. హాల్లో సినిమా చూస్తున్న ప్రేక్షకులతో మాట్లాడారు. టిక్కెట్ల ధరలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. నివేదికను జాయింట్ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్ సిహెచ్‌వి.రమేష్, ఆర్ఐ కోమలి, సచివాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాకలో సినిమా థియేటర్‌లో అగ్నిమాపక పరికరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీలేఖ

హంగర్ ఫ్రీ వరల్డ్ పేరిట ఉచిత భోజనాలు

ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వరల్డ్ హంగర్ డే సందర్భంగా 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకం పేరుతో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో 70 వేల ఉచిత భోజనాలు పంపిణీ చేయాలని మలబార్ సంస్థ నిర్ణయం తీసుకుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సిరిపురం మలబార్ షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మలబార్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు 4,100 భోజనాలు అందించాలనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ సంస్థ విద్యా సామాజిక సంక్షేమ పథకం కింద దేశవ్యాప్తంగా 716 మైక్రో లెర్నింగ్ సెంటర్లను స్థాపించిందని, వీధిబాలలకు ప్రాథమికవిద్య పోషకాహారం అందిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 32 వేల మంది పిల్లలు ఈ సెంటర్లలో చేరగా, వారిలో 9,000 మంది పాఠశాలలకు వెళ్లినట్లు తెలిపారు. దానల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ ప్రాజెక్టు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మలబార్ జోనల్‌హెడ్ ఫిబిన్ మాట్లాడుతూ, తమ వార్షిక సిఎస్ఆర్ బడ్జెట్‌లో 60 శాతం నిధులను నిరుపేదల ఆకలి తీర్చడం, పేదరికాన్ని నిర్మూలించడానికి మలబార్‌గ్రూప్ కేటాయించిందని తెలిపారు. గత సంవత్సరం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోని బాధిత కుటుంబాల పిల్లల ఉన్నతవిద్యకు మద్దతు ఇచ్చేందుకు మలబార్ గ్రూప్ 'ఉయిర్పు' ప్రాజెక్టును కూడా ప్రారంభించిందని, 'గ్రాండ్‌మా హోమ్స్' అనే కార్యక్రమాన్ని కూడా మలబార్ గ్రూప్ ప్రారంభించిందని తెలిపారు. నిరాశ్రయులైన మహిళలకు ఈ హోమ్స్‌లో ఉచిత వసతి సంరక్షణ అందించడానికి షెల్టర్స్ నిర్మించినట్లు వివరించారు.

అంతా అడ్డగోలుతనం...

ఈ మెగా ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా లెక్కకు అందని రాయితీలను కొద్దిరోజుల క్రితం ప్రకటించింది. దీనికోసం జిఒ 8ను (ఒక ప్రయివేటు బడా కార్పొరేట్ కోసం) విడుదల చేసింది. తాజ్ హోటల్ ఉన్న స్థలంలో 260 గదులతో ఫైవ్ స్టార్ హోటల్, 90 సర్వీస్ అపార్టుమెంట్లు, 12750 చదరపు అడుగుల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, 2500 టెక్నాలజీ స్పేస్ సీటింగ్ కెపాసిటీతో నిర్మించే ఈ భవన సముదాయం పేరు 'తాజ్ వరుణ్ బీచ్'. దీనికోసం సుమారు రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్ల పెట్టుబడి అవుతుందని తెలుస్తోంది. సుమారు 300 వరకూ గదులతో హోటల్ ఉండబోతుంది. ఒక 1000 నుంచి 1300 మందికి ఉపాధి లభిస్తుందని ఆ సంస్థ తన డిపిఆర్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఎకాఎకిన దీనికి రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ (బోర్డు) అనుమతులను మంజూరు చేసింది. 2024-2029 ఎపి టూరిజం పాలసీ ప్రకారం సదరు సంస్థ కోరిన రాయితీలన్నిటినీ ఇవ్వాలని సిఫారసు చేసింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ గత ఏప్రిల్ నెలలో సమావేశమై రాయితీలు ఇవ్వొచ్చని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అందులో భాగంగా నోవాటెల్ నుంచి ఇటువైపు ఉన్న వరుణ్ హాస్పటాలిటీ భవన సముదాయానికి (అంటే తాజ్ హోటల్ ప్రదేశం)నకు ఐకానిక్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలన్న బాధ్యతను విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజియన్ అథారిటీ (విఎంఆర్‌డిఎ)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం ఇందులో అధికారిక అడ్డగోలుతనం బాహాటంగా వెల్లడైంది.

రాయితీలతో సంపద సృష్టించేస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే జిఎస్‌టి 15 ఏళ్ల రియింబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. అంటే జిఎస్‌టి ఏమీ వరుణ్ సంస్థ చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రాజెక్టు ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై 100శాతం స్టాంపు డ్యూటీ, 100శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ రియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఇచ్చేసింది. భూ వినియోగ మార్పిడి ఫీజులు 100శాతం రియింబర్స్‌మెంట్ చేశారు. భూమి భవనాలు షెడ్లు వంటి లీజు ఒప్పందాలపైనా 100శాతం స్టాంపు డ్యూటీ రియింబర్స్‌మెంట్ ప్రకటించారు. పెట్టుబడి ప్రోత్సాహకంగా రూ.కోట్లలో రాయితీలను ఈ సంస్థకు ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకరించింది. హోటళ్లకు వాణిజ్య విభాగంలో విద్యుత్ ఛార్జీలు (టారిఫ్) ఉండాలి. యూనిట్‌కు రూ.11 చెల్లించాలి. కానీ రూ.6తో ఇస్తున్నారు. విద్యుత్ సుంకం యూనిట్‌కు రూపాయి వసూలు చేయాలి. దీన్ని ఐదేళ్ల వరకూ రియింబర్స్‌మెంట్ ఇచ్చారు. అంటే ఏటా ఎలక్ట్రిసిటీ టాక్స్ (సుంకం) రూ.90లక్షలు మినహాయించారు. ఉపాధి కల్పించిన వారి సంఖ్యను బట్టి ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్‌ను ప్రభుత్వం ఇస్తుందంట.

భూమి పూజలో ప్రభుత్వ పెద్దలు

తాజ్ హోటల్ స్థలాన్ని వరుణ్ హాస్పిటాలిటీస్ 'హేండోవర్ చేసుకున్నాక సంస్థ అధినేత ప్రభుకిశోర్ నిర్వహించిన 'భూమి పూజ'కు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలైన మంత్రి లోకేష్, ఆయన తల్లి భువనేశ్వరి సహా రాష్ట్ర మంత్రి అనిత, కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వంటి దిగ్గజ నాయకులు విచ్చేశారు.

నేటి నుంచి యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నుంచి సచివాలయ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. యోగా అసోసియేషన్ సభ్యులతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్షించారు. సచివాలయానికి తొమ్మిది మంది చొప్పున యోగా శిక్షణకు ఎంపిక చేశామని, వారందరికీ మాస్టర్ ట్రైనర్లు పక్కాగా శిక్షణ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 29, 30, 31 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని, వారి ద్వారా సాధారణ పౌరులకు శిక్షణ అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే యోగాసనాలపై నిర్వహిస్తున్న పోటీలను పకడ్బందీగా జరిపించాలని చెప్పారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తొట్లకొండలో జూన్ 1వ తేదీన నిర్వహించనున్న యోగా ఈవెంట్‌కు అధికారులు సన్నద్ధంగా ఉండాలని, జూన్ 8న పోర్టు స్టేడియంలో జరిగే సీనియర్ సిటిజన్ యోగా కార్యక్రమ నిర్వహణకు కూడా పక్కా ఏర్పాట్లు చేయాలని, తగిన శిక్షణ అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్, యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య వార్తలు ప్రచారం చేయొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అత్యవసర పరిస్థితుల్లో తప్ప 3,4 రోజుల వరకూ ఇళ్లను వదిలి బయటికి రావద్దని కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న వార్తల్లో వాస్తవం లేదని విశాఖ పోలీసు కమిషనరేట్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 'నగర పరిధిలో అనుమానాస్పద కదలికలు ఉన్నాయని, దయచేసి పోలీసు, ఆర్మీ బలగాలకు సహకరించాలని, వివిధ ప్రదేశాలలో ప్రజలు సంచరించడం నిషిద్ధం' అని వస్తున్న ప్రకటనలను నమ్మవద్దని కోరారు. ఇటువంటి అవాస్తవ ప్రకటనలు ప్రచారం చేయవద్దని, ఆ విధంగా చేసిన వారిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జర్నలిస్టులకు 4 సెంట్లు భూమి కేటాయించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో జర్నలిస్టులకు 4 సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఎపియు డబ్ల్యూజె) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు విశాఖ జిల్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జిల్లాలో ఆనందపురం, సబ్బవరం, పెందుర్తి మండలాల్లో ఇప్పటికే పేదల ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ జరిగిందని, కొంతమంది లబ్ధిదారులకు కేటాయించగా మిగిలిన స్థలాన్ని జర్నలిస్టులకు కేటాయించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు 4 సెంట్ల భూమిని కేటాయించేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు బి.నారాయణరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.హరినాథ్, రవి తదితరులు ఉన్నారు.

కొండా రాజీవ్‌ను పరామర్శించిన వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం పరామర్శించారు. అరుణాచలం వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంపై వాసుపల్లికి కొండా రాజీవ్‌గాంధీ వివరించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని వాసుపల్లి గణేష్‌కుమార్ ఆకాంక్షించారు.

అధికారంలోకి రావాలంటే యువత పాత్ర కీలకం

వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే యువత పాత్ర చాలా కీలకమని వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉరుకూటి చందు ఆధ్వర్యాన బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కెకె.రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షపార్టీ కార్యకర్తలు, నాయకులపై చేస్తున్న దాడులకు, కుట్రలకు భయపడవద్దనవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీ తోడుగా నిలుస్తుందన్నారు. 2029లో పార్టీ అధికారంలోకి వచ్చాక కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేకూరేలా జగన్ 2.0 పరిపాలన ఉంటుందన్నారు

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వాసవి క్లబ్, విశాఖ కంటి ఆసుపత్రి, విబార్డ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన గత నెలలో నిర్వహించిన కంటి పరీక్షల్లో కంటి అద్దాలు అవసరమని గుర్తించిన 10 మంది నిరాశ్రయుల్లో 8 మందికి బుధవారం ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.

మరో 1400 మంది తొలగింపు అన్యాయం

జరుపుతున్న టిడిపి ఈ రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెపుతున్నారని, ఉన్న కార్మికులను తొలగించడం, స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి పూనుకోవడం సరైందికాదని పేర్కొన్నారు.

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, కార్మికులంతా ఐక్యంగా పోరాడుతుంటే యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేసి సమ్మెను విచ్ఛిన్నానికి పూనుకోవడాన్ని తప్పుపట్టారు. జిల్లాలో అన్ని కార్మిక సంఘాలూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. అన్యాయంగా కార్మికులను తొలగిస్తే స్థానిక ప్రజాప్రతినిధులు ఏమాత్రం స్పందించకపోవడాన్ని ఎండగట్టాలన్నారు. కార్మికుల తొలగింపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని, అలాంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరించకుండా కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, డిపి, నాన్ డిపిల మధ్య వ్యత్యాసం తెచ్చి కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రకు పూనుకుంటున్నారని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులుంటేనే ప్లాంట్ ఉత్పత్తి సాగుతుందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కెఎం.శ్రీనివాస్, ఎం.సోమరాజు, కె.వంశీ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

I, KARRI ARUNA
C/o. P.Balakrishna Rao,
Iintegral's Sunrise City
Apartment, Madhurawada,
Visakhapatnam.
I Lost My Original Passport
Vide Passport No. T2654279
While house shiffing from
Yendada to Madhurawada,
Visakhapatnam on
10-12-2024 if anybody found
Please Contact by Me.
Cell : 8341686685

LOSS OF PASSPORT

I, KARRI SANJANA
C/o. P.Balakrishna Rao,
Iintegral's Sunrise City
Apartment, Madhurawada,
Visakhapatnam.
I Lost My Original Passport
Vide Passport No. T2654281
While house shiffing from
Yendada to Madhurawada,
Visakhapatnam on
10-12-2024 if anybody found
Please Contact by Me.
Cell : 8341686685

PUBLIC NOTICE

My client Hinduja Housing Finance Private Limited Anakapalli Branch represented by its manager instructs that Pyla Ramanamma W/o. Sriramamurthy approached my client to sanction loan to her and offered scrutiny of his Guarantor by name Pyla Kanaka Mallesawari D/o. Sriramamurthy property admeasuring 145.2 Sq yards covered by survey No. 116-1, 17 situated at Jalluru Village, Kotauratla Mandal, Anakapalli District she got Registered Gift deed bearing Document No. 727 of 2025 Dated 01.02.2025, S.R.O. Kotauratla executed by Pyla Ramanamma to Pyla Kanaka Malleswari.

Tha said Pyla Ramanamma (Loan applicant's) original sale deed in respect of above mentioned 145.2 Sq. yars in S.No. 116-1, 117 Document No. 3506/2020 date 09.11.2020 was lost on.19.09.2024 on travelling in Kotauratla Police Limites and she give a police compalint and police give not trace certificate. on.07.11.2024. No. MLD012400461399.

If any body has got objection claims charges of any other interest in the schedule property the have to state their objections with the under signed with in 7 days with documentary proof objection recovered subsequent will not be taken into consideration and my client will proceed to sanction loan to Pyla Ramanamma.

KAMIREDDI APPALANAIDU
Advocate
Narsipatnam - 531116,
Anakapalli District.
Cell : 9849464361.

Narsipatnam
Date: 28.05.2025

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT SRIKAKULAM
M.V.O.P. 145/2024

Between:-
Rothu Gowri .....Petitioner
And:-
Nayana Sankar Reddy and others .....Respondents

To,
R1) Nayana Sankar Reddy S/o Mallibabu, aged 33 years, Hindu, Driver of the Car bearing No.AP 39 BV 9909, R/at Door 26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatam, 530001, Andhra Pradesh.
R2) Nayana Satyavati W/o Sankar Reddy, aged 28 years, Hindu, household duties, owner of car bearing No.AP 39 BV 9909, R/at Door 26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatam, 530001, Andhra Pradesh.

NOTICE

It is to inform you that the above matter stands posted to on 18-06-2025 for your appearance .Hence you have to appear before the Honourable court on **18-06-2025 at about 10.30 AM** .as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.
// By order of the Honourable court//

Bagadi Appala Naidu
ADVOCATE, Srikakulam

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL (FAMILY COURT) DISTRICT JUDGE CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT SRIKAKULAM
M.V.O.P. 172/2024

Between:-
Sadasivuni Prameela and another....Petitioners
And:-
Nayana Sankar Reddy and others ....Respondents

To,
R1) Nayana Sankar Reddy S/o Mallibabu, aged 33 years, Hindu, Driver of the Car bearing No.AP 39 BV 9909, R/at Door 26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatam, 530001, Andhra Pradesh.
R2) Nayana Satyavati W/o Sankar Reddy, aged 28 years, Hindu, household duties, owner of car bearing No.AP 39 BV 9909, R/at Door 26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatam, 530001, Andhra Pradesh.

NOTICE

It is to inform you that the above matter stands posted to on 17-06-2025 for your appearance.Hence you have to appear before the Honourable court on **17-06-2025 at about 10.30 AM** .as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.
// By order of the Honourable court//

Bagadi Appala Naidu
ADVOCATE, Srikakulam

రోడ్లుపై మురుగునీటితో పరేషాన్!

అయినాడలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

- నిండా గోతులతో రూపుకోల్పోయిన రహదారులు
- అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని బిఆర్ తాళ్లవలస, అయినాడ తదితర గ్రామాల్లో రహదారులపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో బాటసారులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. బిఆర్ తాళ్లవలస హైస్కూల్‌కు సమీపంలో గ్రామం నుండి అయినాడకు వెళ్లే మార్గంలో తారు రోడ్డుపైనే వర్షపు నీరు నిల్వతో రోడ్డంతా గోతులమయమై, అందులో నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు అవస్థలు పడక తప్పడం లేదు. ఇదే గ్రామంలో ఎస్‌సి కాలనీ నుంచి ప్రభుత్వ మద్యం దుకాణం వరకు ప్రధానరోడ్డుపైనే మురుగునీరు నిత్యం ప్రవహిస్తుండడంతో రోడ్డంతా ఛిద్రమైంది. తారురోడ్డుకాస్తా మట్టిరోడ్డుగా మారిపోవడంతో, గోతుల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుండడం, వాహనాలు వెళ్లే సమయంలో అక్కడెవరైనా ఉంటే వారిపై కంపుగొడుతున్న మురుగునీరు వెదజల్లబడడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు

ఇదేవిధంగా అయినాడ గ్రామంలో యాతపేట సమీపంలో పక్కా రోడ్డుపై నుండి 500 మీటర్ల పొడుగునా నిత్యం వాడుకనీరుతోపాటు ఇపుడు వర్షపునీరు చేరి నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రేవిడి గ్రామం నుంచి అయినాడు వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు గుర్రై రాకపోకలకు ఇబ్బందిగా మారింది దీనిపై ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.అలాగే బిఆర్.తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో రోడ్డుపై మురుగనీరు ప్రవహిస్తుండడం వల్ల గోతుల్లో నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతోందని, దీని వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కారానికి ఆయా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపలా పటిష్టంగా డ్రైనేజీలు నిర్మాణం చేపట్టడం ద్వారా రోడ్డుపై మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానికులతోపాటు అటుగాప్రయాణిస్తున్న వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు.

కాలువలో పూడుకుపోయిన చెత్తాచెదారం

వైద్య పథకాల సర్వేలో అలసత్వంపై ఆగ్రహం

ప్రజాశక్తి- సీతమ్మధార : అభ ఐడి నమోదు, ఎన్‌సిడిసిడి సర్వే ఇహెచ్‌ఆర్ తదితర వైద్యపథకాల నమోదులో అలసత్వంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నరసింహనగర్-1 పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రిలో సిబ్బంది హాజరు, ఒపి, ఇతరరికార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు.

ఈ సందర్భంగా అవుట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఆసుపత్రి ప్రసవాలు, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్స్, కెపిఐ ఇండికేటర్స్ గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేసారు. యుపిహెచ్‌సిలోని వైద్యాధికారులు సిబ్బంది విధిగా ముఖ హాజరు వేయాలని, రోగులకు అన్ని వేళలా వైద్యసేవలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎఎన్‌ఎంలతో సమన్వయపరుచుకుని ఆశా కార్యకర్తలు విధులను నిర్వర్తించాలని, తమ ప్రాంతాలలో గర్భిణులకు వ్యాక్సినేషన్, రెగ్యులర్‌గా ఆరోగ్యతనిఖీలు, అవసరమైన మందులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, డిపిఎంఒ, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యుపిహెచ్‌సిలో తనిఖీలు చేస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ కోటేశ్వరరావు

పుస్తకావిష్కరణ

అధ్యాపకులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 'స్టూడెంట్స్ అండ్ కమ్యూనిటీ సర్వీస్' అను పుస్తకాన్ని అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. నర్సీపట్నం అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ హరికిరణ్, రామకృష్ణ, స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ షేక్ హిదయతుల్లా షరీఫ్ సంయుక్తంగా రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయితలైన అధ్యాపకులను ముత్తంశెట్టి అభినందించారు. ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు

దుకాణం లూటీ : నగదు అపహరణ!

- ప్రశ్నించినందుకు చంపేస్తామంటూ ఇంటి యజమాని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దుకాణ నిర్వాహకుడు అందుబాటులో లేని సమయం చూసి ఇంటి యజమాని షాపును లూటీ చేసి, నగదు తస్కరించిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇదేం న్యాయమని ప్రశ్నించిన దుకాణ నిర్వాహకుడ్ని ఇంటి యజమానులు చంపేస్తామని బెదిరించడంతో బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం ప్రకారం... భానోజీనగర్‌కు చెందిన అంధవరపు స్వామి డాబాగార్డెన్స్‌లోని దిగుమర్తి మారుతీ కుమార్, జాహ్నవిల నుంచి 2017లో రెండస్తుల భవనాన్ని అద్దె నిమిత్తం తీసుకున్నాడు. 'లోటస్ టోయ్ వరల్డ్' పేరిట దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. అందుకు నెలకు రూ.30వేల అద్దె, రూ.2లక్షలు అడ్వాన్స్‌కు ఒప్పందం కుదుర్చుకున్నారు. భవనం పునర్నిర్మాణం పేరిట 2019లో మోడలింగ్ చేయగా అద్దె రూ.60వేలు, రూ.5లక్షల అడ్వాన్సు అంటూ మారుతీ దంపతులు డిమాండ్ చేశారు. ఆ తర్వాత కూడా క్రమేపీ అద్దె పెంచుతూ వచ్చారు. అలా ఇప్పటి వరకు నెలకు అద్దె రూ.72,600, అడ్వాన్సు సొమ్ము రూ.5లక్షలైంది. నగదు రూపంలోనే అద్దె చెల్లించాలంటూ ఇంటి యజమాని ఒత్తిడి చేయడంతో అంధవరపు స్వామి అలాగే చేశారు. ఈ క్రమంలో స్వామి మూడు నెలలుగా అద్దె చెల్లించలేకపోయాడు. భార్య అనారోగ్యం, ఇతర వ్యక్తిగత అవసరాల నిమిత్తం నెలన్నర పాటు ఇతర ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. గత మార్చిలో దిగుమర్తి మారుతీ కుమార్, జాహ్నవి తాను లేని సమయం చూసి దుకాణం బోర్డులు పీకేశారని, తాళాలు బద్దలుకొట్టి దుకాణంలోని రూ.20లక్షల స్టాకును మాయం చేశారని, క్యాష్ కౌంటర్‌లో ఉండాల్సిన నగదు రూ.1లక్ష కనిపించడం లేదని స్వామి పోలీసులను ఆశ్రయించారు. భవనం నవీకరణ చేస్తున్నప్పుడల్లా సుమారు రూ.18లక్షల మేర ఫర్నిచర్ కోసం ఖర్చు చేశానంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించగా మారుతీకుమార్, జాహ్నవి చంపేస్తామంటూ బెదిరించారని పేర్కొన్నారు. కొన్నాళ్ల పాటు దుకాణం మూసేయాల్సి రావడంతో ఇబ్బందయిందని, తన అడ్వాన్స్ వారి వద్ద రూ.5లక్షలు ఉన్నప్పటికీ రకరకాలుగా వేధించేవారని బాధితుడు వివరించారు. పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించానని స్వామి తెలిపారు. తమకు సరిగా అద్దె చెల్లించడం లేదని, అడుగుతుంటే పట్టించుకోలేదని ఆ ఇంటి యజమానులు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 23న కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ కె.సతీష్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వ్యాన్ క్యాబిన్, ఇన్‌సెట్‌లో మృతుడు

ప్రజాశక్తి -ఆనందపురం: పెందుర్తి, ఆనందపురం జాతీయరహదారిలో దుక్కువానిపాలెం టోల్‌గేట్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన వ్యాన్ డ్రైవర్ మృతి చెందారు. వివరాలివి.

మహారాష్ట్ర పర్బాని జిల్లాకు చెందిన నేతాజీ సుభాష్ ధోత్ (27) ఐచర్ వ్యాన్‌లో హైదరాబాద్ నుండి టిష్యూ పేపర్లు తీసుకొని మధురవాడ మెట్రో షాపింగ్ మాల్‌కు వస్తుండగా దుక్కువానిపాలెం టోల్ ప్లాజా సమీపంలో అదుపుతప్పి ముందుగా వెళ్తున్న వాహనాన్ని బలంగా ఢీకొనడంతో క్యాబిన్‌లోనే డ్రైవర్ చిక్కుకుపోయారు. ప్రమాదంలో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతిచెందారు

సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సిబ్బంది సంఘటన చేరుకొని మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీసి ఆనందపురం ఎస్సై సంతోష్ పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు మృతుడికి మహారాష్ట్రకు చెందినవాడిగా గుర్తించి మొబైల్ ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. సోదరుడు తానాజీ సుభాష్ సమాచారం స్థానిక పోలీసులకు అందించారు మహారాష్ట్ర ,పర్బాని జిల్లా, రాణి సవర్గాన్ పోస్ట్, బోతి గ్రామానికి చెందిన సుభాష్ గోవిందరావ్ దోతి, ఉష సుభాష్ దంపతులకు ఇద్దరు కుమారులు ఒక అమ్మాయి పెద్దవాడైన నేతాజీ సుభాష్ దోత్ ఐచర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు మృతునికి భార్య సురేఫ నేతాజీ, ఆరేళ్ల కుమార్తె శృతి నేతాజీ ఉన్నట్లు సమాచారం. ఆనందపురం ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

అలరించిన సంగీత విభావరి, చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎన్‌టిఆర్ మహానటుడే కాదు, మహా మనిషి, సంఘసంస్కర్త అని, ఆయనతో నాలుగున్నరేళ్ల ప్రయాణించడం మరిచిపోలేని మధురానుభూతి అని పద్మ విభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్‌తో కేవలం సహాయకునిగా తన భాషా పాండిత్యాన్ని అందివ్వగలిగానన్నారు. బుధవారం పౌర గ్రంథాలయంలో వజ్రోత్సవాల్లో భాగంగా రాగమాలిక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సంగీత విభావరి నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌ను చూసి జీవితంలో అనేక విషయాలు నేర్చుకోవాలన్నారు సంగీత కార్యక్రమాన్ని కళా ప్రముఖులు సన్ మూర్తి ,మహమ్మద్ ఖాన్, చౌదరి అప్పారావు, కెవి సత్యనారాయణ, పార్థసారథి, ఫణి స్వామి, రాజశేఖర్, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరానికి చెందిన గాయనీగాయకులు శ్రీనివాసరెడ్డి, ఇందిరా సాహిని, మీనా కుమారి, బొమ్మిడి సత్యనారాయణ, తదితరులు ఎన్‌టిఆర్ నటించిన చిత్రాలలో గీతాలను ఆలపించి అలరించారు.

ఆకట్టుకున్న ఎన్‌టిఆర్ చిత్ర ప్రదర్శన

పౌర గ్రంథాలయంలో బుధవారం నటరత్న సంస్థ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పి రాజేశ్వరరావు పెన్సిల్‌తో గీచిన వివిధ ఎన్‌టిఆర్ చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో ఉంచిన 150కిపైగా ఎన్‌టిఆర్ చిత్రాలు ఆయన అభిమానులతోపాటు ప్రేక్షకులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను కళా ప్రముఖులు సన్ మూర్తి, బయ్యా శ్రీనివాస్, పోర్టు సత్యం, భూపతి సందర్శించారు .

వైభవంగా పరదేశమ్మ పండుగ

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు, ఉత్తర నియోజకవర్గంలో పరదేశమ్మ అమ్మవారు మారువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కెకె.రాజును ఆలయ ఉత్సవ కమిటీలు సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో దాడి శ్రీను,పొలరావు,యడ్ల శ్రీనివాసరెడ్డి, జె.శ్రీనివాసరెడ్డి, పరదేశిరెడ్డి, గాలి ప్రసాద్, బీశెట్టి ప్రసాద్, చందన సాయి, రిషికేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ర్యాలీలో పాల్గొన్న డిపిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెం లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఎం శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. సంపద తయారీలో మెళకువలు, సేకరణ పద్ధతులు, ఉపయోగాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రంగా ఎంపిక చేసినట్లు ఇఒపిఆర్‌డి కె రమేష్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించా స్థానిక సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, మూలకుద్దు పంచాయితీ సర్పంచ్ కొయ్య రామకృష్ణా రెడ్డి, టిడిపి నాయకులు ఆనంద్, పంచాయితీ కార్యదర్శులు ఆదిరెడ్డి గాయత్రి, ప్రసాద్, రామారావు, రామకృష్ణ తది తరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనకు

'గీతం'లో మాక్‌డ్రిల్

అవగాహన కల్పిస్తున్న నౌకాదళ సిబ్బంది

ప్రజాశక్తి -మధురవాడ : పని చేసే ప్రదేశంలో భద్రతను పెంపొందించడానికి, ఉద్యోగస్తులు తమ జీవన విధానంలో భద్రత, ఆరోగ్య రక్షణ ఒక భాగంగా మలచుకునేలా అవగాహన కలిగించడానికి భారత నౌకాదళం (ఐఎన్ఎస్ కళింగ), గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా ప్రారంభించిన కార్యక్రమంలో, బహుళ అంతస్తులు, టెక్నాలజీ విభాగాలు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ల విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం భద్రత విభాగం అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌కుమార్ సింగ్, ఐఎన్ఎస్ కళింగ అధికారులు హజరై అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై నమూనా ప్రదర్శన చేసారు. అలాగే ప్రమాదాల నివారణకు అంకిత భావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం అధికారులు, గీతం సెక్యూరిటీ డైరెక్టర్ బిక్రమ్ పట్నాయక్, గీతం సేఫ్టీ విభాగం అధికారి కె.పి.ఛక్రధర్, గీతం విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ గోపి కుమార్, వివిధ విభాగాల అధిపతులు, గీతం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ హరీష్, ఇతర పోలీసులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ నదిని అనుకుని హైవేపై రాకపోకలు సాగించే పలు వాహనాలను పోలీస్ సిబ్బంది తో కలిసి భీమిలి ఎస్ఐ జి హరీష్ బుధవారం తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అనుమానిత వాహనాలను, వ్యక్తులను తనిఖీలు చేశారు. రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులను గుర్తించడంతో పాటు రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ అనైతికం

240వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న పోర్టు కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు ఉద్యోగులు, కార్మికుల కృషితో సాకారమైన గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రైవేటీకరించడం అనైతికమని పోర్టు ఉద్యోగుల యూనియన్ నాయకుడు కె.సత్యనారాయణ అన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న నిరసన దీక్షలు బుధవారం 240వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడుతూ, పిపిపి పద్ధతిలో అభివృద్ధి పేరుతో విశాఖ పోర్టు ఆసుపత్రికి టెండర్లు ఆహ్వానిస్తున్నా ఎవరూ రాకపోవడంతో మళ్లీమళ్లీ వాయిదాలు వేసి కొత్త టెండర్లు పిలుస్తుండడం దుర్మార్గమన్నారు. సుమారు 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబీకుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న వైద్యాన్ని ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు విశాఖ నగర అభివృద్ధిలో పోర్టు చెల్లిస్తున్న పన్నులు ఎంతో కీలకమని, ఏటా రూ. 65 కోట్ల పన్నులను జివిఎంసికి విశాఖ పోర్టు చెల్లిస్తోందన్నారు. విశాఖ పోర్టుకు రిజర్వ్ ఫండ్స్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, కార్మికులు, ఉద్యోగుల మనోభీష్టానికి వ్యతిరేకంగా ప్రైవేటీకరణకు దూకుడుగా పోవడం సరికాదన్నారు. పోర్టు సొంతనిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. వైద్యులు నియామకం, అవసరమైన మందులు సమకూర్చి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపిలు స్పందించాలన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచనను విరమించుకుంటే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. సత్యనారాయణ, కెఎస్ కుమార్, సిహెచ్ త్రినాధరావు, బి జగన్, వివిఎస్ మూర్తి, రాఘవులు పాల్గొన్నారు

అపోలో వైద్యునికి అరుదైన గౌరవం

ఎస్ఐసిఒటి ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌కు డాక్టర్ అబ్దుల్‌ఖాన్ పరిశోధనా కథనాలు

డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ ఏడాది సెప్టెంబరులోని స్పెయిన్‌లో మాడ్రిడ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాలజీ (ఎస్ఐసిఒటి) ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌లో అపోలో వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్.డి.ఖాన్ సమర్పించిన మూడు శాస్త్రీయ పరిశోధన కథనాలు ఆమోదించు బడ్డాయి. ఈ మేరకు ఎస్ఐసిఒటి కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ ఆయనకు ఆహ్వాన లేఖను పంపించింది. ఎస్ఐసిఒటి ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌కు డాక్టర్ ఖాన్ కథనాలు ఎంపిక కావడం ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది. శాస్త్రీయ కథనాలలో మన రాష్ట్రంలో మొదటిసారిగా డాక్టర్ ఖాన్ చేసిన అరుదైన, వినూత్న శస్త్రచికిత్సలు ఉన్నాయన్నారు. భుజం స్నాయువు చీలిక కోసం రిజెనెన్ బయో ఇంప్లాంట్, మోకాలి పాక్షిక చీలిక కోసం యాంటిరియర్ క్రూసియేట్ లెగ్మెంట (ఏసిఎల్) చిలిక కోసం రేడియోఫ్రీక్వెన్సీ ధర్మల్ ష్రింకేజ్(ఆర్ఎఫ్‌టిఎస్) వంటి విజయవంతమైన శస్త్రచికిత్సలు ఉన్నాయి.

రామారావు లేని లోటు తీర్చలేనిది

మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక మార్కెట్ చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షులు, సిపిఐ సభ్యుడు ఎం. రామారావు ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు.. బుధవారం గాజువాకలో నిర్వహించిన సంతాప సభలో రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక మార్కెట్ అభివృద్ధితో పాటు చిల్లర వర్తకుల సంక్షేమానికి రామారావు విశేష కృషి చేశారని కొనియాడారు. గాజువాక మార్కెట్‌ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడి, కార్పొరేషన్ నిర్వహించేలా చేయడంలో రామారావు కృషి మరువలేనిదన్నారు. రామారావు ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఆడారి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్, జిల్లా కార్యదర్శి షేక్ రహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ,ఎం.మన్మధరావు, ఎన్.నాగభూషణం, కె.వనజాక్షి, జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి. పద్మ, టి.సాంబమూర్తి, మార్కెట్ కమిటీ ప్రతినిధులు కర్రి వేంకటేశ్వరరావు, విల్లూరి శ్రీను, పప్పు అప్పారావు, ఈశ్వరరావు ,ఎస్. సుగుణ పాల్గొన్నారు.

సముద్రతీర కోత నివారణకు చర్యలు



భీమిలి తీరంలో వేసిన ఆర్‌సిసి, కాంక్రీట్ క్యూబ్‌లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డునో వాటెల్ ఎదురుగా బుధవారం సముద్ర తీరం కోతకు గురైంది.సమాచారం తెలుసుకున్న జెడిసి బమ్మి అయ్యప్పనాయుడు, జివిఎంసి కార్య నిర్వాహక ఇంజనీర్ శ్రీరామ వెంకటవాసు, సహాయక ఇంజనీర్ జి సురేష్ సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. తీరం కోతకు గురిగాకుండా తక్షణ చర్యలు చేపట్టారు. తీరం వెంబడి ఆర్‌సిసి, కాంక్రీట్ క్యూబ్‌లను ఏర్పాటు చేసి తక్షణ నివారణ చర్యలు చేపట్టారు.

జులై 14 నుంచి గీతం దూరవిద్య పరీక్షలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ద్వారా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది జులై 14వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. దీనికి సంబంధించి జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆలస్య రుసుము రూ.500తో జూన్ 15వ తేదీ వరకు, ఆలస్య రుసుము రూ.1500 చెల్లించి జూన్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల కోసం cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలిందిగా సూచించారు.

జూ పార్కులో చిత్రలేఖన పోటీలు

వేసిన చిత్రలేఖనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ ధోల్ డే సందర్భంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో బుధవారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆసియాటిక్ వైల్డ్ డాగ్(ధోల్)పై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ధోల్ జీవనశైలి, నివాస ప్రాంతాలపై తమ సృజనాత్మకత, ఆలోచనలను చిత్రలేఖ రూపంలో వ్యక్తీకరించినట్లు తెలిపారు. కార్యక్రమం ద్వారా ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో ధోల్ సంరక్షణ, వాటి ప్రాధాన్యత గురించి విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తెలుసుకున్నారన్నారు. కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మధురవాడ : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి వుడా కాలనీ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం మూడవ జోన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. దీంతో పోర్ట్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, సుద్ద గెడ్డ ఏరియా, వాంబే కాలనీ, శ్రీనివాస్ నగర్,తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం

అప్పారావు దంపతులను సత్కరిస్తున్న శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డులో పారిశుధ్య విభాగంలో సూపర్వైజర్‌గా విధులు నిర్వర్తించి, బుధవారం ఉద్యోగ విరమణ చేసిన కె.అప్పారావును జివిఎంసి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘనంగా సత్కరించారు. శాంతినగర్ జివిఎంసి కార్యాలయంలో అప్పారావు దంపతులకు పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే.మలేరియా విభాగంలో విశిష్ట సేవలందించిన సూర్యప్రకాశరావు సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జివిఎంసి మలేరియా, పారిశుధ్య విభాగం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై మరింత బలమైన చర్యలు

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతమైన ప్రతిస్పందన ద్వారా ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్న అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ, విపత్తుల నివారణపై మరింత బలమైన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. పారిశ్రామిక ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు వంటి ప్రమాదాలకు సంబంధించి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విపత్తుల సందర్భంలో పోలీస్ అధికారులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం సమన్వయంతో స్పందించాల్సిన అవసరాన్ని వివరించారు. బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లావ్యాప్తంగా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు.

గతంలో అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాల్లో జరిగిన ఘటనలను పరిశీలించి, ఎస్‌ఓపి రూపొందించామన్నారు. విపత్తు తీవ్రత ఆధారంగా విధులు పంపిణీ చేస్తూ క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ ఏర్పాటు, ప్రమాద స్థలానికి జోనల్ కమాండ్‌లు వెంటనే చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విపత్తుల సమయంలో ఉపయోగించే సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్‌పి

అగ్నిమాపక శాఖ, వైద్య బృందాలు, స్థానిక పోలీసులు కలిసి సమిష్టిగా పని చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాస్యూటికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సహకారంతో, సిఎస్ఆర్ నిధుల ద్వారా పోలీసులకు అత్యాధునిక ఫైర్ సేఫ్టీ పరికరాలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, పరవాడ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, ట్రైనీ డీఎస్పీ ఎంవికె.చైతన్య, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మి, గఫూర్, రమేష్, రామకృష్ణ, మన్మధరావు, సంజీవరావు, ఆర్.మల్లికార్జునరావు, ఎన్.గణేష్, సి.హెచ్.నరసింగరావు, వెంకటనారాయణ, అశోక్ కుమార్, ధనుంజయరావు, కుమార్ స్వామి, అప్పన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

31న జిల్లాలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ 1వ తేదీన ఆదివారం వచ్చినందున మే 31వ తేదీనే ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఒక ప్రకటన విడుదలలో తెలిపారు. ఈ నేపథ్యంలో 30వ తేదీ నాటికి డబ్బులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 31వ తేదీ శనివారం సాయంత్రంలోగా శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్రమంగా మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలోని రంగబోలు గెడ్డలో మట్టి అక్రమ తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు బుధవారం ఉమ్మడిగా దాడి చేశారు. ఈ గెడ్డలో కొంత మంది వ్యక్తులు ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కశింకోట సిఐ స్వామి నాయుడు, మండల తహశీల్దారు జి.సత్యనారాయణ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఇసుక తవ్వకానికి ఉపయోగించిన ట్రాక్టర్లు గుర్తించి విచారణ చేపట్టారు. కొన్ని రోజులుగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ఈ అక్రమ చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శోభనాద్రి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక మెయిన్ రోడ్‌లో గల యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా టి.శోభనాద్రి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయనగరం జిల్లా చీపురుపల్లి బ్రాంచ్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసిన దాసరి రమేష్ విశాఖపట్నంకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధితులు చేపట్టిన మేనేజర్ టి.శోభనాద్రిను బ్యాంకు సిబ్బంది సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సిబ్బంది అందరూ ఖాతాదారులకు మెరుగైన సేవలు చేసి పంపించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కాండ్రేగుల హరికృష్ణ, ఏవిజె రాజు, నానాజీ, భవాని, వెంకటలక్ష్మి, శిరీష, శ్రీదేవి, యశోద, రోజాశ్రీ, మాలతి, ఆడారి రాము, అప్రైజర్ కృష్ణ, మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-రాంబిల్లి : జూన్ 9న నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి మండలంలోని మామిడాడ కొత్తూరులో స్థల పరిశీలన చేశారు. కార్యక్రమానికి 3000 వేలు మంది హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మామిడాడ కొత్తూరు ఎస్సీ కాలనీని సందర్శించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి ఎంపీడీవో, తహశీల్దారు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి-కశింకోట : ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్ అంశాలపై కశింకోట మండల పరిషత్తు సమావేశ మందిరంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో పూర్తిస్థాయిలో పనులు చేపట్టాల్సిందిగా తెలియజేశారు, ప్రస్తుతం గ్రామాల్లో 5600 వరకు ఉపాధి శ్రామికులతో పని జరుగుతున్నట్లు, దాన్ని ఎనిమిది వేల వరకు పెంచవలచాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో రైతులకు ఎవరైనా హార్టికల్చర్ కావాలంటే వారి డేటా తీసుకొని సబ్మిట్ చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో రైతులకు ఉపయోగపడే కంపోస్ట్ ఎరువు. రైతు పంట పొలాల్లో ఫారం పాంట్స్ యావరేజ్ వేజ్ 300 తక్కువగా చూడవలసిందిగా ఫీల్డ్ అసిస్టెంట్స్ కు సూచించారు. ప్రతి పంచాయతీ నందు కనీసం ఏడు గంటల పని చేసేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ ఎం శ్రీనివాసరావు, కామేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్స్ ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

నేటి నుండి 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శైలజ

డాక్టర్ శైలజ

ప్రజాశక్తి - యలమంచిలి : జిల్లాలో ఎంపిక చేయబడిన మండలాల్లో గురువారం నుండి 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యలమంచిలి బిసిటి కృషి విజ్ఞాన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ తెలిపారు. యలమంచిలిలో బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) సంయుక్తంగా మే 29 నుండి జూన్ 12 వరకు 15 రోజుల పాటు 'వికసిత సంకల్ప్ అభియాన్' పేరుతో దేశంలోని అన్ని కృషివిజ్ఞాన కేంద్రాల్లోని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయం పట్ల గ్రామాలకు వెళ్ళి అవగాహన కల్పిస్తారని తెలిపారు. కొత్తఆలోచనలు, కొత్త పంట రకాలు, ప్రభుత్వ పథకాలు, డ్రోన్ సాంకేతికత, పంటల వైవిధ్యం వంటి అంశాలపై గ్రామాలకు బృందాలుగా వెళ్లి రైతుల్ని, రైతు సంఘాలనూ కలిసి వివరిస్తారన్నారు. పాయకరావుపేట మండలం సత్యవరంలో శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్ర ఆధ్వర్యంలోనూ, కశింకోట మండలంలోని జంగాలపల్లిలో శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీహరి నేతృత్వంలోనూ, మాకవరపాలెం మండలంలో డాక్టర్ వి.ప్రసాదరావు ఆధ్వర్యంలోనూ గురువారం ప్రారంభమౌతాయని పేర్కొన్నారు. 15 రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల రైతులను కలుస్తారని వివరించారు.

పెరుగుతున్న రైవాడ నీటి మట్టం



నిండుకుండలా ఉన్న రైవాడ జలాశయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైవాడ జలాశయం నీటి మట్టం పెరుగుతోంది. గత ఏడాది ఇదే రోజున 104.8 మిల్లీ మీటర్లు నీటిమట్టం ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి 110.92మిల్లీ మీటర్ల నీటిమట్టం నమోదైందని జలాశయ ఏఈ కె.నందకిషోర్ తెలిపారు. జలాశయ గరిష్ట నీటిమట్టం 114 మీటర్ల కాగా జలాశయ ఎగువన కురుస్తున్న వర్షాలకు మరింత నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది. విశాఖ నగరపాలక సంస్థ తాగునీటి అవసరాలకు 50 క్యూసెక్కులు నీటిని, పంట కాలువలకు 50 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రకృతి ప్రేమికులు జలాశయ అందాలను చూసేందుకు వచ్చి, చరవాణిలో ఆ అందాలను చిత్రీకరిస్తున్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన రేషన్ డీలర్లు

ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డీలర్లు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు నంగినారుపాడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలవేసి దుస్సలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ మాట్లాడుతూ వచ్చేనెల 1 తేదీ నుండి గతంలో మాదిరిగానే రేషన్ డిపోల వద్ద కార్డ్ హోల్డర్లకు రేషన్ సరుకులు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొప్పాకల శేషు, కార్యదర్శి పాపాన ఎల్లాజీ, ఉపాధ్యక్షులు విరోతి వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కైకాల సన్యాసిరావు, కోశాధికారి దంగేటి నరేష్, గౌరవ అధ్యక్షులు బోకం రామారావు, మహిళా కార్యదర్శి బండ లక్ష్మి, కార్యవర్గ సభ్యులు ఎర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయంలో బుధవారం సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి, అనుబంధ సంఘాలను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. పట్టణ కొత్త అధ్యక్షులుగా కారుకొండ కన్న యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కోన ఉమా యాదవ్, పట్టణ గౌరవ అధ్యక్షులుగా పాత్రపల్లి కనక అప్పలరాజు, అనకాపల్లి నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా బర్నికాన రాము, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శిగా నేమాల రమేష్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన బాబూరావు, జిల్లా కార్యదర్శి కరక సోమినాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు భరణికాన నరసింహమూర్తి, అనకాపల్లి నియోజకవర్గ ప్రెసిడెంట్ పంచదార సూరిబాబు, కార్యదర్శి ఒమ్మి రాము యాదవ్, అనకాపల్లి మండల ప్రెసిడెంట్ పంచదార్ల కన్నారావు, అనకాపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

కన్నంనాయుడుకు అవార్డు ఇస్తున్న నిర్వాహకులు

కన్నంనాయుడుకు ఉత్తమ ఆరోగ్య సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో హెల్త్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కర్రి కన్నం నాయుడు 2024-25 సంవత్సరానికి ఉత్తమ ఆరోగ్య సేవా రత్న అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును బుధవారం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ అవార్డుతో పాటు రూ.10వేలు నగదు బహుమతిని అందించారు. ఈ అవార్డు అందుకున్నందుకు గాను సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ, సిబ్బంది కన్నం నాయుడును అభినందించారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఎలు

జిఒ 4పై పునరాలోచించాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : జీవో నెంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచించాలని, ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలాగా నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే 2019 ముందు వరకు ఉన్న రెవిన్యూ క్లస్టర్ విధానంలో ఒక రెవిన్యూ విలేజ్‌కి ఒక వీఆర్వో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని దేవరాపల్లి వీఆర్వోల సంఘం నాయకులు బుధవారం తహశీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, కె.జగదీష్ మాట్లాడుతూ తహశీల్దార్లకు, రెవిన్యూ డిపార్మెంట్‌కు సంబంధం లేకుండా గ్రామ వార్డు సచివాలయాల ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయిలో ఎంపీడీవోలు, అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్లు చేసిన ఈ క్లస్టర్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

పాడి రైతులకు సన్మానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు బుధవారం సన్మానం చేశారు. గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు, కె.జగ్గారావు, కే.మహేశ్వరరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో అధిక పాల సరఫరా చేసినందుకుగాను వారిని సాలువతో సత్కరించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె శేషు పాడి రైతులకు అధిక పాల దిగుబడికి మెలుకువలు, పశు పోషణ, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, పశువైద్యులు హేమ సుందర్రావు, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, కె జ్యోతి, కె పరదేశి నాయుడు, ఎం సీతారాం, బి సత్తిబాబు, కే సూరిబాబు, కే రామ అప్పారావు, కే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను సన్మానిస్తున్న హెరిటేజ్ ప్రతినిధులు

త్వరలో ఇంటింటికి కుళాయిలు

జనవాణిలో ఎమ్మెల్యే విజయకుమార్

ప్రజాశక్తి - యలమంచిలి : అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా త్వరలోనే ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచినీరు అందించే కార్యక్రమం ప్రారంభిస్తామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హామీ ఇచ్చారు. బుధవారం యలమంచిలి రైల్వే స్టేషన్‌రోడ్డులోని జనసేన క్యాంపు కార్యాలయంలో జరిగిన 'జనవాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ యలమంచిలి డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా లారస్ కంపెనీతో ఎంఒయు చేసుకుంటామన్నారు. యానాద్రి కలువ ప్రక్షాళన ద్వారా మురికి రూపుమాపుతున్నామన్నారు. కాలేజ్ క్రీడా మైదానంలో అసాంఘిక శక్తులు చొరబడి రాత్రి వేళల్లో మందు, గంజాయి సేవించడం అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికార్లతో పాటు కూటమి నాయకులు ఉరుకూటి రమేష్‌నాయుడు, కర్రి ఝాన్సీ, రాజాన శేషు, లవుడు లోవరాజు, కోరారు శ్రీనివాసరావు, బొద్దపు శ్రీనివాసరావు, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వినతి

బతుకు భారమైందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తమకూ అర్హత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'జనవాణి' కార్యక్రమంలో మున్సిపల్ ఎలక్ట్రికల్, వాటర్ వర్కర్లు వినతి పత్రం సమర్పించారు. తాము సుమారు 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నామని, ఏపిసిఒఎస్ సంస్థ ద్వారా జీతాలిస్తున్నారని, నెలకు ఇఎస్ఐ, పిఎఫ్ పోను రూ.13వేలు వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. తమకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందడం లేదని వాపోయారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ ఎలక్ట్రికల్, వాటర్ కాంట్రాక్టు సిబ్బంది ప్రతినిధులు టి.శ్రీనివాసరావు, టి.లోవేశ్వరరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగింది. గ్రంథాలయాధికారిణి పి.దమయంతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి నీతికథలు చదివించారు. ఉపాధ్యాయులు రాజుబాబు, బిఎస్ ప్రసాద్‌లు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ, మాజీ ముఖ్య మంత్రి రామారావు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కిలో 2 రూపాయల బియ్యం పథకం ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు స్లో సైక్లింగ్ ఆటల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

సబ్బవరంలో వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

సబ్బవరం : స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయం అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి కుండలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ అధికారి రత్నకుమార్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ సకినా చెప్పారు. రుతుక్రమం ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం ఆరోగ్య కేంద్రం ఆవరణలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమంలో పరిశుభ్రతకి ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కిశోర్ బాలికలు, యుక్త వయస్సు గల వాళ్లు పరిశుభ్రత పాటించకుంటే గర్భాశయ క్యాన్సర్, గర్భస్రావాలు అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో అధిక పోషకాలు కలిగిన పప్పులు, చిరుధాన్యాలు, కొవ్వు పదార్థాలు లాంటివి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్ వైద్య సిబ్బంది శాంతి, ఇందిర, నాగేశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : రుతుస్రావం అనేది సాధారణమైన ప్రక్రియని, శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతంగా ఆనందంగా ఉండొచ్చుని, అపోహలు వీడాలని దేవరాపల్లి పిహెచ్సి వైద్యాధికారిణి ఈ.పూజ్య మేఘన అన్నారు. రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి, బాలికలకు అవగాహన కల్పించారు. సిహెచ్‌ఓ ఎం.ఆనంద్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

8న ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ 8వ తేదీన జరగనున్న అనకాపల్లి మండలం సత్యనారాయణపురం హేమగిరి శ్రీసత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఛైర్మన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామంలో కనకదుర్గమ్మ నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వేడుకకు గ్రామంలోని భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రిడ్జికి రక్షణ గోడ లేని దృశ్యం

పంది గెడ్డ బ్రిడ్జికి రక్షణ గోడ నిర్మించరూ...

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జి.సింగవరం గ్రామం వద్ద అచ్చర్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పందిగెడ్డ బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి మీదుగా అచ్చర్ల, కొత్త అచ్చర్ల, మోసయ్యపేట, సింగవరం, గోకివానిపాలెం గ్రామాలతో పాటు కశింకోట, బుచ్చయ్యపేట, రావికమతం మండలాల ప్రజలు వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం కురిస్తే పంది గెడ్డ పెద్ద ఎత్తున పొంగి ఈ బ్రిడ్జిపై నుండి నీరు ప్రవహిస్తుంది. ఈ సమయంలో బ్రిడ్జి ఎంత వరకు ఉందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పందిగెడ్డ బ్రిడ్జికి రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

తాళ్లపాలెం చేరిన సత్యసాయి రథం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో తాళ్లపాలెం రామాలయం వద్దకు శ్రీసత్య సాయి రథం బుధవారం చేరుకుంది. గ్రామస్తులు సత్య సాయి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం సత్య సాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

2న ఆపరేషన్ కగార్‌పై సదస్సు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆపరేషన్ కగార్ అనే అంశంపై సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన అనకాపల్లి రోటరీ హాల్‌లో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడిబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ దండకారణ్యం ద్వారా నెత్తుటి ఏరులై పారిస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్ కగార్ వెనుక అటవీ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గొర్లె దేవుడి బాబు, వియ్యపు రాజు, వేమల కన్నబాబు, రెడ్డి అప్పలనాయుడు, పరమేష్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారకరామారావు జయంతిని బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించింది.

అనకాపల్లి:కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్.టి.రామారావు చిత్రపటానికి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు ఎన్.ఉమామహేశ్వరి ఎన్‌టి. రామారావు జీవిత చరిత్రను తెలియజేయగా, భాగవతుల శిరీషారాణి వారి శ్రీసాయి నాటక అకాడమీ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్‌డిసి సుబ్బలక్ష్మి, కె.మనోరమ, జిల్లా గణాంకాధికారి జి.రామారావు, జిల్లా సప్లయి అధికారి కెఎల్‌ఎన్.మూర్తి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీవి.విష్ణు స్వరూప్, ట్రైనీ డీఎస్పీ ఎంవికెచైతన్య పాల్గొన్నారు. అనకాపల్లి చినరామస్వామి కోవెల వద్ద జిల్లా తెలుగు యువత ఆధికార ప్రతినిధి బోడ్డేడ మురళి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. జిల్లా కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి ముందుగా సంఘ సంఘం నాయకులు నివాళులర్పించారు.

కశింకోట : కశింకోట మెయిన్ రోడ్డు వద్ద పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, పెదపాటి కళ్యాణి, సిదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు. బయ్యవరం ఎస్‌కె.బాబర్, శిరం వెంకట లక్ష్మి, మేడిశెట్టి నాగ అప్పారావు, నరసింగబిల్లిలో ఉగ్గిని రమణ మూర్తి, ఎంపిటిసి షేక్ దర్గా, జెర్రిపోతల నూకినాయడు ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు.

సబ్బవరం : టిడిపి మండల అధ్యక్షుడు గండి ముత్యాల నాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకాపల్లిలో మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గణపతి నగర్‌లో రేసిపూడి రమణ, కోన దేముడు, ఇరువాడలో బలిరెడ్డి అప్పారావు నివాళులర్పించారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్లో టిడిపి నేత దొండా గిరిబాబు ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. బంగారుమెట్ట, వడ్డాది, దిబ్బిడి, బుచ్చియ్యపేట, తురకలపూడి, రాజాం, తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టిడిపి నేతలు నివాళులర్పించారు. సర్పంచ్ సుంకర లక్ష్మి, ఎంపీటీసీ యల్లపు జగ్గ, దొండా రమేష్, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నెల పాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక మెయిన్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరుశురాం, మాజీ ఎంపీపీ మొల్లేటి సరళ, నాయకులు దాడి శివ, కన్నబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రీ సర్వే డిటి గఫూర్, మండల సర్వేయర్ గోవిందరాజులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో ఆర్ టి సి కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిహెచ్ రామసూర్యనారాయణరాజు, మీగడ సత్తిబాబు, కర్రి వెంకట సత్యనారాయణ, అడ్డూరి నాగభూషణం, అజీమ్, మీసాల బాబులు, లోవరాజు, సకురు స్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మండలంలో శెట్టిపల్లి ధర్మసాగరం పీఎన్‌ఆర్ పాలెం ఆఫీస్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ మినిస్టేడియంలో నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ,ఎన్టీఆర్‌కు ఎవ్వరూ సాటి లేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలో పలు గ్రామాల్లో తెదేపా నాయకులు ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కైలాసపట్నం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాడుగుల: మాడుగులలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ సూర్యారావు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల అప్పలరాజు, లక్ష్మణరావు, వర్మ, కాశీబాబు, నాగేష్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆర్‌కె.బీచ్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉపకలెక్టర్లు మధుసూదన రావు, శేషశైలజ, సిఎంఒ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. కెజిహెచ్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద పూలమాల వేసి నివాళులర్పించారు.

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి, విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చ విజయ్‌కుమార్, నాయకులు వెల్లంకి భరత్, నక్క కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పూలమాల వేసి నివాళులర్పించారు. జాయింట్ కమీషనర్ రమేష్, కార్యదర్శి మురళీకష్ణ పాల్గొన్నారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌కె.బీచ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ నివాళులర్పించారు.

సీతమ్మధార: ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు డి చంద్రం, టి వనజ, టివి సూర్యప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు బి రామచంద్రప్రసాద్, డి సుమన్, కళ్యాణి, జె శ్రీనివాసరావు, బి అశోక్ కుమార్, పి శ్రీనివాస్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి 2,3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పల కొండ, నాయకులు స్వామి, గాడు సన్యాసి నాయుడు, చురకల రమణ,కొక్కిరి అప్పన్న, జి పోలిరాజు, సంజీవ్ కుమార్, జోగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్టీఆర్ చిత్ర పటానికి ప్రిన్సిపల్ సురేఖ, కోఆర్డినేటర్ సహదేవుడు నివాళులర్పించారు. తగరపువలసలో...రాజ వీధి, తాతా థియేటర్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీ నాయకులు పిట్టా సురేష్, కొప్పల కృష్ణ, డి వెంకటేష్, ఎర్నింటి వెంకట రమణ, కోసూరు రాంబాబు, నరవ రామారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండో వార్డులో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, మాజీ కౌన్సిలర్ బడిగింటి నీల కంఠం, రిక్క సత్య పాల్గొన్నారు.



విశాఖలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్

పద్మనాభం.: పద్మనాభం మండల కాంప్లెక్స్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి మండల తెలుగు యువత అధ్యక్షులు కేవీ సత్యనారాయణ శ్రద్ధాంజలి ఘటించారు. కేకు కట్‌చేశారు. మిఠాయిలు పంచారు. ఎంపిటిసి లక్ష్మీ నాయుడు, నాయకులు మహేశ్వరరావు,. రామరాజు, నర్సింగరావు, ఆర్ఎఎన్ మూర్తి, పావని, ఎం నందిని, పి శ్రీను, కె రమణ, ఎస్ శ్రీను పాల్గొన్నారు

మండలపరిషత్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎంపిడిఒ విజయకుమార్ నివాళులర్పించారు.

కొమ్మాది : జివిఎంసిఐదవ వార్డు పరదేశి పాలెం, వైయస్సార్ కాలనీలలో ఎన్టఇఆర్ నిలవెత్తు విగ్రహాలకు కార్పొరేటర్ మొల్లి హేమలత నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈగల రవికుమార్, నమ్మి శ్రీను, వియ్యపు నాయుడు, బోర అప్పల సూరిబాబు రెడ్డి, ఓలేటి శ్రావణ్, ప్రమేళాదేవి, మిత్తన రమణమ్మ, వాసు, గీత, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరంలో భాగంగా ఎన్‌టిఆర్ జయంతి నిర్వహించారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్. వెంకట్రావు, లైబ్రేరియన్ అజయ్‌కుమార్, ప్రసాదరాజు పాల్గొన్నారు.

మధురవాడ : పిఎం పాలెం క్రికెట్ స్టేడియం దరి నిలువెత్తు ఎన్టీఆర్ విగ్రహానికి జివిఎంసి రెండో జోన్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏడోవార్డు మధురవాడ మార్కెట్, చంద్రంపాలెం బాపూజీ కళామందిరంలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, వార్డు అధ్యక్షుడు పిల్లా నర్సింరావు, పిల్లా మోహనకృష్ణ, నమ్మి శ్రీనివాస్ నివాళులర్పించారు.

అనందపురం:లోడగలవాని పాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ ఆధ్వర్యంలోఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. న్యాయవాది బమ్మిడి సూర్యనారాయణ, బమ్మిడి శ్రీతారక్, రెడ్డి బాబూరావు పాల్గొన్నారు. వేములవలసలో ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్‌రావు నివాళులర్పించారు.

ఆరిలోవ : జివిఎంసి. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్యర్యంలో ఆరిలోవ కాలనీ, వెర్నిదుర్గానగర్, రామక్రిష్ణాపురం, శ్రీకృష్ణాపురం, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో ఎన్టీఆర్ జయంతి పండగలా జరుపుకున్నారు. వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 10వ వార్డులో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో రవీంద్రనగర్, ఇందిరానగర్‌లో ఎన్టీఆర్ నివాళులు అర్పించారు. 11వ వార్డులో టిడిపి అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యంలో ఆరిలోవ బాలజీనగర్, దుర్గాలమ్మ గుడి వద్ద ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

నక్కపల్లిలో యోగా చేస్తున్న ఉద్యోగులు

యోగాపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక వెంకన్న ఆలయం కళ్యాణ వేదిక వద్ద బుధవారం యోగాంధ్ర మండల స్థాయి ప్రోటోకాల్ యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో డీ సీతారామరాజు, ఆయుర్వేద వైద్యాధికారి రఘు, ఎంఈవో కె.నరేష్ యోగాంధ్ర కార్యక్రమం గురించి వివరించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా శిక్షణా తరగతులను ఉద్యోగులు సద్వినియోగపరచుకుని, ఒక్కొక్కరు 50 మందికి శిక్షణ ఇవ్వాలన్నారు. యోగా గురువు దవరసింగి రాంబాబు, మాస్టర్ యోగా ట్రైనర్లు సీ హెచ్ ప్రసాద్, ఆదిత్య రుత్విక్, ఉద్యోగులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, ఉపాధ్యాయులు సీ హెచ్ సత్యనారాయణ, అప్పలరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల:క్రమం తప్పకుండా యోగాసనాలు చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తుందని ఈఓపిఆర్‌డి రఘురాం తెలిపారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండవ రోజు బుధవారం యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగాను ప్రతి ఒక్కరు ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

రథయాత్రను చేపడుతున్న భక్తులు

సత్య సాయిబాబా రథయాత్ర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రశాంతి నగర్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మందిరం నుండి ప్రేమ ప్రవాహిని రథయాత్రను వైభవంగా నిర్వహించారు. సత్య సాయి సేవా సమితుల జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు రథయాత్ర ప్రారంభించారు. ఈ రథయాత్రలో బాలవికాస్ విద్యార్థులు సాయి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సత్య సేవా సమితి కన్వీనర్ పిట్టా రామకృష్ణ, జిల్లా యూత్ మహిళా కోఆర్డినేటర్ భారతి, జిల్లా బాల వికాస్ కోఆర్డినేటర్ శంకర్ , మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ సరోజినీ, పాయకరావుపేట సమితి కన్వీనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

8న స్వాతి నక్షత్రహోమంపై ప్రచారం

ప్రజాశక్తి- వేపగుంట : జూలై నెలలో జరగనున్న సింహాద్రి అప్పన్న గిరిప్రదక్షిణ సజావుగా సాగేందుకు ఇప్పటినుంచే దృష్టి పెడుతున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆర్‌జెసి వేంద్ర త్రినాధరావు అన్నారు. ఇఒగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేవస్థానంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వాటి నివారణతోపాటు మున్ముందు జరిగే ఉత్సవాల నిర్వహణపై ఎఇఒలు, ఇతర అధికారులతో సమీక్షించారు. వచ్చేనెల 8న అప్పన్న స్వామి సన్నిధిలో జరిగే స్వాతి నక్షత్ర హోమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులు ఆదేశించారు కళ్యాణ మండపంలో జరిగే హోమాన్ని ఎక్కువమంది భక్తులు తిలకించేదుకు వీలుగా అక్కడున్న ఉత్సవ వాహనాలు, ఇతర వస్తువులను తొలగించాలని సూచించారు. దేవస్థానం పరిధిలో పాడుబడిన భవనాలు, గోడలు స్థితిపై ప్రత్యక్ష పరిశీలన జరిపి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండాచర్యలు చేపడతామన్నారు.

వినతి పత్రం ఇస్తున్న కోదండరావు

మత్స్యకారులకు ప్రత్యేక ప్యాకేజీ వర్తింపజేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : తీర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో మత్స్యకారుల జీవనభృతికి నష్టం జరుగుతుందని, మత్స్యకారులకు ప్రత్యేక ప్యాకేజీ అందజేసి, అన్ని విధాలుగా ఆదుకోవాలని మత్స్యకార నాయకులు పిక్కి కోదండరావు తెలిపారు. విజయ వాడలో తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నక్కపల్లి మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట కు చెందిన మత్స్యకార నాయకుడు పిక్కి కోదండరావు పాల్గొని, మత్స్యకార సమస్యలపై మాట్లాడారు. మత్స్యకా రులకు 70 శాతం సబ్సిడీతో ఇంజన్లు,వలలు అందజేయాలన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

పవన్‌తోనే సినీ పరిశ్రమకు న్యాయం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సినీ పరిశ్రమకు అన్ని విధాలా న్యాయం చేయడానికే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్య చంద్ర అన్నారు. బుధవారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ పరిశ్రమ బాగుండాలని ఆలోచించే మొదటి వ్యక్తి పవన్ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఇష్టం వచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సినీ ఇండస్ట్రీ సమస్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం అనుచితమన్నారు. మా నాయకుడిపై అనవసరంగా మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్, నాయకులు ఎర్రంశెట్టి పాపారావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-రావికమతం: రెండు మండలాల సరిహద్దులో నేల మట్టమైన విద్యుత్తు స్తంభాలను తక్షణమే పునరుద్ధరించాలని పి.వీటీ.జీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్ కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు మండలాలకు సరిహద్దు గ్రామాలైన సామాలమ్మ కొండపై జిలుగులోవ, పశువుల బంధ గ్రామాల ప్రజలు చిమ్మ చీకటిలో అలమటిస్తున్నారని ఆయన తెలిపారు. వర్షాలకు నాలుగు స్తంభాలు నేలమట్టం అయ్యాయన్నారు.నేటికి మూడు నెలల గడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. అనేకమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం స్పందన లేదన్నారు. ఇప్పటికైనా పడిపోయిన స్తంభాలను నిలబెట్టి ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నర్సీపట్నం ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద కాగడాలతో నిరసన చేపడతామన్నారు.

పిడుగుపడి పాడి గేదె మృతి

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పిడుగు పడి గేదె మృతి చెందింది. రావికమతం గ్రామానికి చెందిన కంఠం రెడ్డి నాయుడు పశువుల పాకలో పాడి గేదే ఉంది. పాక సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తన జీవనాధారమైన గేదె కోల్పోవడంతో నాయుడు కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తి పన్ను సర్వే విరమించాలి

-వార్వా, నివాస్ డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆస్తి పన్ను సర్వే విరమించాలని, ఆస్తి పన్ను సమీక్ష చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయాలని, ఇంటి పన్ను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద వార్వా, నివాస్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి మాట్లాడుతూ, ఆస్తి పన్ను సర్వే విరమించాలని, ఆస్తి పన్ను విధానం రద్దుచేసి ఇంటి పన్ను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ 10 వేల కరపత్రాలను అపార్ట్‌మెంట్లు, నివాస కాలనీలలో పంపిణీ చేసి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఇప్పటికే ఆస్తిపన్ను రద్దు చేయాలని కోరుతూ వేలాది వినతి పత్రాలను సిటీలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు ముఖ్యమంత్రికి పంపించాయని తెలిపారు. బుధవారం 300 వినతి పత్రాలను పంపించామన్నారు. పట్టణాల్లో ఆస్తుల సర్వే ద్వారా 20 శాతం అదనంగా ఆస్తిపన్ను సమీకరించాలని రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దానికనుగుణంగా ఈనెల 14వ తేదీన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర విభాగం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. నగరాలు, పట్టణాలలో ఆస్తులను సర్వే చేసి టాక్స్ అసెస్మెంట్ కానివి, పన్ను తక్కువ ఉన్న వాటిని

మాట్లాడుతున్న వార్వా నివాస్ నాయకులు బిబి గణేష్

గుర్తించి, వాటిపై సవరించిన ఆస్తి పన్ను, పెనాల్టీలు వేసి ఆస్తిపన్ను ఆదాయాన్ని 20 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని ఆదేశాలు పంపించిందన్నారు. ఇది పట్టణ ప్రజల పట్ల చాలా ప్రమాదకరంగా మారుతుందన్నారు.

ఇంటి పన్ను విధానం నుంచి ఆస్తి పన్ను విధానానికి మార్చడం వల్ల ప్రతి ఏడాది 15 శాతానికి తక్కువ కాకుండా గత ఐదేళ్లుగా పన్ను పెరుగుతూ వస్తుందన్నారు. 2021 లో చెల్లించిన ఇంటి పన్ను, ఆస్తిపన్నుగా మారి, 2025 ఏప్రిల్ నాటికి 100 శాతానికి పెరిగిందని వివరించారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి నెలలో ఇళ్ల స్థలాలు, నిర్మాణ విలువలను రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ పెంచిందన్నారు. ఏప్రిల్ నెలలో ఆస్తిపన్ను 15 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆదేశాల వల్ల జూన్ నెలలో మరో 20 శాతానికి తక్కువ కాకుండా పెరగబోతుందన్నారు. ఈ పెనుమార్పులన్నీ 4 నెలల కాలంలోనే ఉంటాయని పేర్కొన్నారు. ప్లాన్‌లో 10 శాతం లోపు డీవియేషన్‌లకు 25 శాతం, 10 శాతంపైన డీవియేషన్లకు 50 శాతం, ప్లాన్ లేకుండా నిర్మాణం చేస్తే 100 శాతం పెనాల్టీ విధిస్తారని తెలిపారు. సవరించిన ఆస్తిపన్నుకు 15 శాతం లిమిటేషన్ క్లాజ్ వర్తించదన్నారు. ఇళ్లల్లో చిన్న షాపులు పెట్టుకుంటే ఆ బిల్డింగులను వాణిజ్య బిల్డింగ్‌లుగా పరిగణిస్తారని, దానివల్ల ఆస్తిపన్ను ఎన్నో రెట్లు పెరుగుతుందన్నారు.

ప్రతిసంవత్సరం 15 శాతం పెరిగే ఆస్తిపన్ను రద్దుచేయాలని తాము పోరాడు తున్నామని తెలిపారు. సర్వేపేరుతో ఆస్తిపన్ను పెంచేదాడిని వార్వా, నివాస్ వ్యతిరేకిస్తున్నాయన్నారు. పట్టణ ప్రజలపై మరింత భారాలుమోపే ఆస్తిపన్నుసర్వేను విరమించాలని కోరారు. ఇంటి అద్దె విలువ రెవెన్యూ ఆదాయంగా ఉంటుంది కనుక అద్దె విలువ ఆధారంగా ఇంటిపన్ను వసూలు చేయడం శాస్త్రీయమైన పద్ధతి అవుతుందని పేర్కొన్నారు. అమ్ముకునేటప్పుడు లభించే ఆస్తి మూల విలువ ఆధారంగా ఆస్తిపన్ను వసూలు చేయడం అశాస్త్రీయం అన్నారు. ఈ అశాస్త్రీయమైన ఆస్తిపన్ను విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ, వార్వా, నివాస్ వేసిన కేసులు హైకోర్టులో న్యాయం కోసం ఎదురు చూస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సర్వేల వంటి ప్రత్యక్ష పరోక్ష పద్ధతుల ద్వారా ఆస్తిపన్ను పెంచే చర్యలను విరమించాలని, ప్రతి ఏటా పెంచే ఆస్తిపన్ను విధానాన్ని రద్దుచేసే 5 ఏళ్లకు ఒకసారి పెంచే ఇంటిపన్ను విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం జివిఎంసి మేయర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, బిఎ.త్రినాథ్ స్వామి, బంగారు నాయుడు, కుమార మంగళం, కె.సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికి...
మండల పరిషత్ కార్యాలయ ఆవరణ బురదమయం

- అవస్థలు పడుతున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి -కోటవురట్ల: వర్షానికి మండల పరిషత్ కార్యాలయం ఆవరణ తడిసి ముద్దవడంతో అధికారులు, సిబ్బంది అవస్థలు పడ్డారు. ఎంపీడీవో, ఈఓపిఆర్‌డి మండల పరిషత్ కార్యాలయానికి విధులు నిర్వహించేం దుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. అయినా ఈ సమస్యను మాత్రం పరిష్కరించలేకపోతున్నారు. సమస్య ఈ రోజుది కాదు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. సాక్షాత్తు మండల పరిషత్తు కార్యాలయం వద్దనే ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారంటే అధికారుల దుస్థితి ఏమిటో అర్థం అవుతోంది. ప్రధాన రహదారి నుంచి నీరు ఎటు వెళ్లక పోవడంతో కార్యాలయం ముందు నుంచి నీటిని పంపించే ఏర్పాట్లు చేశారు. కార్యాలయం ఎదుట బురద పేరుకు పోతుంది. దీంతో సిబ్బంది. ప్రజలు జారిపడుతున్న సందర్భాలు ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు.

బురదలో వెళుతున్న అధికారులు

భూ సేకరణపై రైతులతో సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి: తహసిల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత బుధవారం తహసిల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పెద తీనార్ల గ్రామానికి చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అదనంగా పెద తీనార్ల రెవెన్యూ పరిధిలో భూ సేకరణ చేపట్టడం జరుగుతుందని, పేపర్ నోటిఫికేషన్ జారీ చేస్తామని రైతులందరూ సహకరిం చాలన్నారు. పరిశ్రమల స్థాపన కోసం భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. భూ సేకరణకు సంబంధించి విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పొంచి ఉన్న ప్రమాదం

-ప్రధాన రోడ్డుపైనే కల్వర్టుకు భారీ రంధ్రం

ప్రజాశక్తి-పద్మనాభం. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయం ఎదురుగా కల్వర్టుకు భారీగా రంధ్రం ఏర్పడంది. పద్మనాభం నుండి విజయనగరం పోవు మార్గంలో రెడ్డిపల్లి, కోరాడ వద్ద చిన్నకల్వర్టుపై మధ్యలో భారీగా రంధ్రం పడడంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చేంతవరకు కల్వర్టుపై ఏర్పడ్డ రంధ్రం కనిపించని పరిస్థితుల్లో వాహనదారులు, ముఖ్యంగా బైకిస్టులు ఇందులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. కల్వర్టు గోతిలో పడితే వాహనం పాడవ్వడంతోపాటు తీవ్రగాయాలపాలు కావడం ఖాయమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కల్వర్టుపై రంధ్రానికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

రెడ్డిపల్లి సచివాలయం వద్ద కల్వర్టుపై పడిన రంధ్రం

నగదు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ ఇంటి యజమాని మరణించడంతో ఆపదలో ఉన్న ఆ పేద కుటుంబానికి స్థానిక వాసవి క్లబ్ ఆర్థిక సహకారం అందించింది. అంతర్జాతీయ వాసవీ క్లబ్ ఈ ఏడాది నుండి ప్రారంభించిన మహా ప్రస్థానం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం స్థానిక శివపురంలో నివాసముంటున్న వుప్పల రాజు కుమార్ మరణించడంతో కుటుంబానికి వాసవీక్లబ్ సభుడైన రాజకుమార్ భార్య సుజాత 25 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ, మహాప్రస్థానం చైర్మన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనాధుని శ్రీను, గవర్నర్ కొల్లూరు పార్వతి, రీజినల్ చైర్మక వెలగా నారాయణరావు ప్రెసిడెంట్ రమేష్ కుమార్, సెక్రటరీ కె.బంగారుశెట్టి, జీకే. కంకిపాటి కృష్ణా తదితరులు పాల్గొన్నారు.